ప్రజాశక్తి
బుధవారం 23 ఆగస్టు 2023
5
శ్రీకాకుళం

పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలి

కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మొక్కలు నాటే కార్యక్రమం శతశాతం పూర్తి చేయాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు అధికారులను ఆదేశించారు. కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు సెప్టెంబరు నెలాఖరుకు వంద రోజులు పని పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. ఫిబ్రవరి 28వ తేదీ నాటికి కూలీల రోజువారీ కూలి రూ.260కి చేరుకోవాలని సూచించారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కూలీల బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, జాబ్‌కార్డ్స్, వర్క్ ఫైల్స్ అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి ఎస్.అమ్మినాయుడు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ఎపిఒ శ్రీనివాసరావు, భాస్కరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రకటిత కోతలు

- జిల్లా అవసరాలకు తగ్గట్టుగా పంపిణీ కాని విద్యుత్
- భారీ పరిశ్రమలకు కొద్ది గంటలపాటు నిలిపివేత
- పల్లెలకూ తప్పని కోతలు
- ఇబ్బందులు పడుతున్న జనం

ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో వాతలు పెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ సరిగా సరఫరా చేయకుండా వాతలు పెడుతోంది. జిల్లా అవసరాలకు మేర విద్యుత్ పంపిణీ జరగకపోవడంతో అనివార్యంగా కోతలు విధించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ఎసిల వినియోగం ఎక్కువగా ఉండడంతో కరెంట్ వాడకం పెరుగుతోంది. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా లేని సమయంలో వినియోగం పెరిగిపోవడంతో గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా భారీ పరిశ్రమలకు కొద్ది గంటలపాటు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. వాస్తవానికి పల్లెలకు గంటల తరబడి విద్యుత్ సరఫరా జరగడం లేదు. కొన్నిచోట్ల పట్టణాలకూ కోత తప్పడం లేదు. కరెంట్ ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు ఇస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 9,23,416 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో కేటగిరి-1 పరిధిలోని గృహ వినియోగ కనెక్షన్లు 7,89,151 ఉన్నాయి. కేటగిరి-2 కింద వాణిజ్య అవసరాలకు 76,476 మంది విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. కేటగిరి-3లో 3,067 పరిశ్రమలు కరెంట్‌ను వాడుతున్నారు. కేటగిరి-4 పరిధిలోకి వచ్చే వీధిదీపాలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించి 22,154 కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు సుమారు 24 వేలు కనెక్షన్లు ఉన్నాయి. కరెంట్ వాడకాన్ని బట్టి ఎల్‌టి (లో టెన్షన్), హెచ్‌టి (హై టెన్షన్) కేటగిరీలుగా విభజించారు. విద్యుత్ వినియోగం 75 కిలో యూనిట్లు లోపు ఉన్న సర్వీసులను ఎల్‌టి కనెక్షన్లుగా, 75 కిలోవాట్లు దాటితే హై టెన్షన్ కనెక్షన్లుగా పరిగణిస్తారు. జిల్లాలో మొత్తం 8,72,033 ఎల్‌టి కనెక్షన్లు ఉండగా, 58.46 కోట్ల యూనిట్ల కరెంట్‌ను వినియోగిస్తున్నారు. 494 హెచ్‌టి కనెక్షన్లు ఉండగా 5.25 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారు.

జిల్లా కోటాపై కోత

గత వారం రోజులుగా జిల్లా అవసరాలకు కావాల్సిన విద్యుత్, పంపిణీ అయిన కరెంట్ పరిశీలిస్తే, విద్యుత్ కోతలకు దారితీసిన పరిస్థితులు తేటతెల్లమవుతాయి. ఈనెల 13న తేదీన 5.38 మిలియన్ యూనిట్ల కరెంట్ అవసరం కాగా 5.44 మిలియన్ యూనిట్లే సరఫరా అయింది. 14న 5.40 మిలియన్ యూనిట్లు వాడితే 5.28 మిలియన్ యూనిట్లు పంపిణీ అయింది. 15న 5.25 యూనిట్లు ఉపయోగిస్తే జిల్లాకు 5.29 మిలియన్ యూనిట్ల కోటా వచ్చింది. 16న 5.42 మిలియన్ యూనిట్లకు గానూ 5.33 మిలియన్ యూనిట్ల జిల్లాకు పంపిణీ అయింది. 17న 5.12 మిలియన్ యూనిట్లకు గానూ 5.19 మిలియన్ యూనిట్లు, 18న 4.63 మిలియన్ యూనిట్లకు గానూ 5.32 మిలియన్ యూనిట్లు పంపిణీ అయింది. 19న 5.04 మిలియన్ యూనిట్లు ఉపయోగించగా, ఆ రోజున 5.25 మిలియన్ యూనిట్లు సరఫరా అయింది. 20న 5.03 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను వినియోగించగా 5.07 మిలియన్ యూనిట్లు జిల్లాకు పంపిణీ అయింది. దీంతో గృహావసరాలు, పరిశ్రమలు, వ్యవసాయం తదితర అన్నిరంగాలకు అందిస్తున్న విద్యుత్ సరఫరలో కోత విధించాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

ఫ్రీక్వెన్సీ బట్టి సరఫరాలో మార్పులు

గ్రిడ్‌ల నుంచి వచ్చే విద్యుత్‌లో ఫ్రీక్వెన్సీ బట్టి సరఫరాలో మార్పులు చేస్తున్నాం. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా కావడం లేదు. జిల్లాలో భారీ పరిశ్రమల వరకు కొద్ది సమయం కరెంట్ ఆపుతున్నాం. విద్యుత్ కోతలు మాత్రం విధించడం లేదు.

- ఎల్.దైవప్రసాద్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ

కరెంట్ కోతతో ఇబ్బందులు

ఎండలు ఎక్కువగా ఉండడం, ఉక్కపోతతో ఎసిల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. వర్షాలు పడిన సందర్భంలో డిమాండ్ కాస్త తగ్గుతోంది. విద్యుత్ పంపిణీ తగ్గడం, అవసరాలు పెరగడంతో లోటును తగ్గించుకోవడానికి పరిశ్రమలకు, పల్లెలకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పగలంతా పనులకు వెళ్లి రాత్రిళ్లు కునుకు తీద్దామంటే ఉక్కపోత, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

28న మోటారు సైకిల్ యాత్ర

- జీడికి మద్దతు ధర కల్పించాలి
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు

పలాస : జీడికి మద్దతు ధర కల్పించాలని, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 28న మోటార్ సైకిల్ యాత్రను చేపట్టనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ వెల్లడించారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 80 కేజీల జీడి పిక్కలకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీడి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ లక్ష సంతకాల సేకరణలో భాగంగా ఇప్పటివరకు 14 మండలాలు, 108 గ్రామాల్లో 82,500 మంది రైతుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. సంతకాల సేకరణకు గ్రామాల్లో రైతుల, జీడి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. లక్ష సంతకాల సేకరణకు మద్దతుగా ఈనెల 28న కంచిలిలో బైక్ ర్యాలీని ప్రారంభించి కవిటి, సోంపేట, మందస, హరిపురం, కాశీబుగ్గ మీదుగా పలాస చేరుకుని ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతుసంఘం వజ్రపుకొత్తూరు మండల కార్యదర్శి తమ్మినాన భాస్కర్, కె.బాలాజీ, కుత్తుం వినోద్, కొర్ల హేమారావు చౌదరి, కోనేరు గురయ్య, కారి పురుషోత్తం, కుత్తుం ఢిల్లీరావు, సిఐటియు నాయకులు దిలీప్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇసుక ర్యాంపు వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

అధికార పార్టీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాలతో నదీ ప్రవాహం దిశ మారి సాగు, తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆరోపించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని రోణంకిలో ఇసుక ర్యాంపు వద్ద రైతులతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిరోజూ వందల లారీలతో రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని, దీనివల్ల నదీగర్భం కోతకు గురై భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. దీంతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నదిలో 70 వేల క్యూసెక్కుల నీరున్నా, బ్యారేజీకి రాకపోవడానికి కారణం నదిలో 25 అడుగుల మేర అక్రమ తవ్వకాలు చేపట్టడమేనన్నారు. గొట్టాబ్యారేజీ వద్ద డౌన్ స్ట్రీమ్ వైపు బౌల్డర్ ఎప్రాన్ పూర్తిగా దెబ్బతిందని, బ్యారేజీ దెబ్బతిన్నా మరమ్మతులు చేయడం లేదని విమర్శించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు పేషీ, అధికార పార్టీ స్థానిక నాయకులు కొంతమంది అధికారులతో కలిసి ఇసుక దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం చోద్యం చూస్తోందని విమర్శించారు. ధర్నాలో సింగుపురం ఎంపిటిసి పంగ సత్యనారాయణ, బైరి మాజీ ఎంపిటిసి అమ్మన్నరావు, అలికాం ఎంపిటిసి నాగేశ్వరరావు, రెడ్డి గిరిజాశంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భారత అంతరిక్ష పరిశోధనా స్థానం నుంచి నింగిలోకి దూసుకుపోయిన చంద్రయాన్-3 చంద్రునిపై సురక్షితంగా దిగి చరిత్ర సృష్టించాలని ఆశిస్తూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఆమదాలవలస మండలంలోని గాజుల కొల్లివలసలో సంగమయ్య కొండ దిగువన వేసిన చంద్రయాన్-3 సైకతశిల్పం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

మీ క్యాంపస్‌లో మీరే కాప్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

బాధ్యత గల ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీసేనని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. విద్యార్థి దశలో సామాజిక బాధ్యతతో పాటు క్రమశిక్షణ, సమయపాలన వంటి మంచి లక్షణాలు అలవాటు చేసుకోవాలన్న ముఖ్య ఉద్దేశంతో జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన క్యాంపస్ కాప్స్-2ను నగరంల్నోఇ బాపూజీ కళా మందిరంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం, టెక్కలిలో ప్రవేశపెట్టిన క్యాంపస్ కాప్స్‌లో సుమారు 213 మంది విద్యార్థులు శిక్షణ పొందిన తర్వాత 780 గంటలు పోలీసులతో విధి నిర్వహణలో సహకారాన్ని అందించారని తెలిపారు. దిశ యాప్ రిజిస్ట్రేషన్, ట్రాఫిక్ రూల్స్, ముఖ్యమైన చట్టాలు తదితర అంశాలపై మళ్లీ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా అన్ని సర్కిల్ హెడ్‌క్వార్టర్స్‌లో మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అంకితభావం, క్రమశిక్షణే క్యాంపస్ కాప్స్‌కు మొదటి అర్హత అని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కువ యువత పోక్సో కేసుల్లో నేరస్తులుగా నమోదవుతున్నారని తెలిపారు. విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలని, వారి విషయాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. యువత సైబర్ నేరాలు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గతంలో క్యాంపస్ కాప్స్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు వారి అనుభవాలను పాలుపంచుకున్నారు. శిక్షణలో నేర్పనున్న అంశాలపై ముద్రించిన బుక్‌లెట్‌ను ఎస్‌పి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి ఎన్.మణికంఠ, అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, సిహెచ్.జి.వి ప్రసాద్, డి.విజయ్‌కుమార్, సిఐలు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్‌పి కార్యాలయం తనిఖీ

వార్షిక తనిఖీలో భాగంగా శ్రీకాకుళం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని ఎస్‌పి సందర్శించి పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణ, ముఖ్యమైన గ్రేవ్ కేసుల దర్యాప్తుపై కేసు ఫైళ్లను తనిఖీ చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేవ్ కేసులు జరిగేందుకు అవకాశం ఉన్న గ్రామాల్లో ప్రతిరోజూ పోలీస్ సిబ్బంది సందర్శించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా గ్రామ పెద్దలతో మాట్లాడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. తనిఖీలో డిఎస్‌పి వై.శృతి, సిఐలు ఎల్.ఎస్ నాయడు, పి.శ్రీనివాసరావు, పైడయ్య, ఆదాం ఉన్నారు.

మహిళా వాలంటీరు ఆత్మహత్య

పొన్నాడ వంతెనపై నుంచి దూకిన రాజేశ్వరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాజేశ్వరి మృతదేహం

శ్రీకాకుళం మండలం ఖాజీపేటకు చెందిన మహిళా వాలంటీరు దూకి రాజేశ్వరి (22) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఎచ్చెర్ల మండలం పొన్నాడ వంతెనపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖాజీపేట సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి గ్రామానికి చెందిన ఎస్.శివకుమార్‌ను ఆరు నెలల కిందట ప్రేమించి వివాహం చేసుకుంది. శివకుమార్ స్థానికంగా కార్పెంటర్ పనులు చేస్తూ భార్య రాజేశ్వరి, తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో కలహాలు తలెత్తడంతో కొద్దిరోజుల కిందటే భార్యభర్తలు గ్రామంలో వేరు కాపురం పెట్టారు. భర్త శివకుమార్ రోజూ మద్యం తాగి వస్తుండడంతో ఇంట్లో గొడవలు పడుతున్నారు. దీన్నే అలుసుగా తీసుకున్న రాజేశ్వరి అత్తమామలు శివకుమార్‌ను ఆమెపై వేధింపులకు ప్రోత్సహించేవారని స్థానికులు చెప్తున్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన రాజేశ్వరి అత్తింటి వారి వేధింపులు ఎక్కువ కావడంతో విసిగి వేశారి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని గ్రామంలో అనుకుంటున్నారు. పొన్నాడ వంతెనపై నుంచి ఓ మహిళ దూకిందన్న సమాచారంతో ఒకటో పట్టణ పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వంతెన వద్ద మహిళ చున్నీ, టూత్ బ్రష్ గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది నీటిలో దిగి గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం కునుకుపేట సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార ముద్దాయికి జీవిత ఖైదు

శ్రీకాకుళం : బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే... జలుమూరు మండలం గుండువలసకు చెందిన నిందితుడు కె.సింహాచలం 2021 జూన్ ఐదో తేదీన మూత్ర విసర్జనకు వెళ్లిన బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లి నిర్మాణంలో ఉన్న ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలో బాలిక కేకలు వేసి ఏడ్చినా పెళ్లి హడావుడిలో ఎవరికీ వినిపించలేదు. తీవ్ర రక్తస్రావంతో విలపిస్తున్న బాధిత బాలికను తల్లిదండ్రులు గమనించి జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి ఎస్.వాసుదేవ్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి రమణమూర్తి ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచి, ఎస్‌పి జి.ఆర్ రాధిక పర్యవేక్షణలో సరైన సాక్ష్యాధారాలను రుజువు చేయడంతో నిందితునికి మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.ఆరు వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కచ్చితమైన సాక్ష్యాధారాలతో దర్యాప్తు పూర్తి చేసిన దర్యాప్తు అధికారి ఎస్.వాసుదేవ్, నరసన్నపేట సిఐలు డి.రాము, బి.ప్రసాద్, ఎస్ఐ పారినాయుడు, కోర్టు మానిటరింగ్ పోలీసు సిబ్బందిని ఎస్‌పి రాధిక అభినందించారు.

పోర్టు వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

పోర్టు వాహనాలు అడ్డగింత

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మూలపేట అదానీ పోర్టు ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ ఢీకొని సంతబొమ్మాళికి చెందిన తంగి గణపతికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన సంతబొమ్మాళి గ్రామస్తు గ్రావెల్ తరలిస్తున్న పోర్టు వాహనాలను మంగళవారం రాత్రి అడ్డుకున్నారు. పదుల సంఖ్యలో టిప్పర్లు ఆగిపోవడంతో పాలేశ్వరస్వామి ఆలయం నుంచి సంతబొమ్మాళి ఎంపిడిఒ కార్యాలయం వరకు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోర్టు వాహనాలు నిత్యం సంతబొమ్మాళి గ్రామంలో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఎన్నిసార్లు చెప్పినా డ్రైవర్లు అతివేగంతో వాహనాలను నడుపుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని కూడలిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా నడపడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు వాహన డ్రైవర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదని, అడిగిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మారలేదని చెప్పారు. ఇలాగే కొనసాగితే పోర్టు వాహనాలను గ్రామంలో తిరగనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమంతో సుపరిపాలన

ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, పలాస

పాలనలో సంస్కరణలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను తమిళనాడు ప్రభుత్వం అనులు చేసేందుకు సిద్ధమైందని తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్న కేరళ ప్రభుత్వం, ఆ రాష్ట్రంలో ఇలాంటి వ్యవస్థనే తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వారే తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తున్నారని చెప్పారు. వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం ఫౌండర్ కార్యదర్శి జి.శాంతమూర్తి మాట్లాడుతూ మానవతా దృక్పథం లేకపోతే టెక్నాలజీ వృథా అని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి వి.బాల మోహన్‌దాస్, బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ తిమ్మారెడ్డి, పాతపట్నం, టెక్కలి, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.శ్రీరాములు, గోవిందమ్మ, స్వప్న హైందవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి మూలాలు కనుగొనడమే ప్రభుత్వ లక్ష్యం

ఉద్దానంలో మహమ్మరిలా వ్యాపిస్తున్న కిడ్నీ వ్యాధి మూలాలు కనుగొనడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. కాశీబుగ్గలో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు. అంతకుముందు పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

మంచి చేసిన వారికే ఓటు వేయండి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు మంచి చేసిన వారికే ఓటు వేయాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని సీపన్నాయుడుపేటలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏం మంచి చేశారని ప్రశ్నించారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలు చేసి ప్రజలను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వానికి ప్రజల ఆదరణ పెరగడాన్ని తట్టుకోలేని విపక్షాలు విష ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్షితమంచినీటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, సాధు వైకుంఠరావు, చల్లా అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన **మరాటి పురుషోత్తం**, S/o మరాటి మోహన్ రావు, పాస్ పోర్ట్ నంబర్ M1685288 తేదీ 10-08-2023న జమేదారుపుట్టుగ నుంచి కవిటి గ్రామానికి బైక్ మీద వస్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల పురుషోత్తం కి గానీ, కవిటి పోలీస్ స్టేషన్ కి గానీ అప్పగించాలని విజ్ఞప్తి.

8247256573

IN THE HONORABLE COURT OF THE 1St ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM IA20/21 IN 16/2017

Between:-
Mohammed Haneef --Petitioner/Plaintiff
And:-
Md.Shanwaj & others
--Respondents/defendants

To,
Proposed party:
R-40 Korada Chandra shekhar Rao S/0 late Vasudeva rao, aged about 50 years Hindu R//at plot No.59,SVGB Colony, Srikakulam Town and District.

Please take notice that the above **IA20/21 IN OS16/2017** Added of proposed respondent No40 the matter posted to posted to **28/08/2023** for your appearance in the above said court. you are informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

**K. SRINIVASA RAO
ADVOCATE,
SRIKAKULAM.**

మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S 58/2016

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
మందస రి.బై బ్రాంచ్ మేనేజర్ --వాది
మరియు: పులారి నారాయణ (Died) వగైరాలు
--ప్రతివాదులు

To,
D-4 పులారి పురుషోత్తం S/o late నారాయణ.
D-5 పులారి హేమరాజు S/o late నారాయణ.
D-6 పులారి ఉమాపతి S/o late నారాయణ,
రట్టి గ్రామం, మందస మండలం,శ్రీకాకుళం జిల్లా.

పైనెంబరు దావాలో వాది ప్రతివాదులపై దావా సొమ్ము వసూలు నిమిత్తం పైన తెలిపిన కోర్టులో దావా తెచ్చియున్నారు. అయితే 4,5,6వ ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు కోర్టు ద్వారా, మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిననూ అందు కోకుండా తప్పించుకు తిరుగుచున్నారు. కావున మీ హాజరు నిమిత్తం పైదావాను **తే18-09-2023దిన** వాయిదా వేసియున్నారు. పై తెలిపిన తేదిన పైన తెలిపిన కోర్టు నందు **ఉ॥10-30 గం॥** లకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కోవలెను. లేని ఎడల దావా మీపరోక్షంగా విచారించి తీర్మానించబడునని ఈ ప్రకటన మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో..)
ఇట్లు
శమళ్ళ వైకుంఠమూర్తి
వాది తరుపు న్యాయవాది, సోంపేట.

మాట్లాడుతున్న మాధవరావు

యుసిసిని రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దేశంలో మత ఉద్రిక్తతలు సృష్టించనుందని, మోడీ సర్కార్ తొమ్మిదేళ్లుగా ఆలయాలు, గోపురాలు, మతం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. కాశీబుగ్గ సూదికొండ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కామన్ సివిల్ కోడ్ తీసుకువచ్చి ముస్లిముల, మైనార్టీల హక్కులను రద్దుపరచాలని చూస్తున్నారని ఆరోపించారు. లౌకిక దేశమని చెప్పుకుంటున్న మన దేశంలో అన్ని మతాల సంప్రదాయాలు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక మతంలో ఒక రకమైన వివాహ పద్ధతి, విడాకుల పద్ధతి, దత్తత తీసుకునే పద్ధతి ఒక్కొక్క మతంలో ఒక్కో రకంగా ఉంటుందని అన్నారు. 2016లో వేసిన లా కమిషన్ ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని ఈ చట్టం వల్ల దేశంలో మత ఉద్రిక్తతలు తలెత్తుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొప్ప లౌకిక దేశమని బయట దేశాల్లో చెప్పుకుంటున్న మోడీ దేశంలో లౌకిక ప్రజాస్వామిక విలువలను ఎందుకు కాపాడలేకపోతున్నారని ప్రశ్నించారు. ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు సృష్టించి అశాంతి కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కామన్ సివిల్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మామిడి భీమన్న, జుత్తు వీరాస్వామి, సోమేశ్వరరావు కూర్మారావు ఈశ్వరమ్మ, వినోద్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

దాడికి ప్రతి దాడి తప్పదు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి టిడిపి నాయకుల పైన, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, ఇప్పటి వరకు సహనంగా ఉన్నామని, ఇక ఊరుకొనే ప్రసక్తే లేదని, దాడికి ప్రతిదాడి చేస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హెచ్చరించారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మందస మండలానికి చెందిన తలగాన రాజశేఖర్‌పై వైసిపి కార్యకర్తలు దాడికి నిరసనగా మంగళవారం శాంతి నిరసన తెలిపారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై, నా కుటుంబంపై నాలుగేళ్లుగా సోషల్ మీడియా సాక్షిగా అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నా సహనంతో ఇప్పటి వరకు ఉన్నామని అన్నారు. ఇప్పటికైనా ఆపాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

అన్నదాత పాట్లు

ఇంజిన్ ద్వారా నీటిని పెడుతున్న రైతు

- ఎండుతున్న పంట పొలాలు
- కాలువల ద్వారా అందని సాగునీరు

ప్రజాశక్తి- టెక్కలి

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు వ్యవసాయ కష్టాలు అన్నీఇన్నీ కావు. ఆగస్టు నెల చివరి రోజులు వచ్చినా ఆశించినంతగా వర్షాలు కురవలేదు సరికదా.. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరగడంతో వరి చేను భూములు ఎండుతున్నాయి. పంట పొలాలు బీడు వారుతున్నాయి. ఆగస్టు చివరి రోజులు వరకు ఎండల తీవ్రత తగ్గలేదు సరికదా పెరిగిన ఉష్ణోగ్రతలు వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వంశధార ఆయకట్టు ద్వారా సాగుకు నీరు వస్తున్నా పంట పొలాలలకు పూర్తిస్థాయిలో నీరు రావడం లేదని రైతాంగం వాపోతున్నారు. ప్రధాన ఎడమ కాలువ నుంచి వచ్చే సాగునీటికి పిల్ల కాలువలు కబ్జాకు గురికావడం, కొన్నిచోట్ల ఆక్రమణలు వల్ల సాగునీరు ప్రవహించలేని పరిస్థితి ఎదురైంది. ఎండల తీవ్రతతో ఎండుతున్న మడులను తడుపుకోవడానికి రైతులు నానా పాట్లుపడుతున్నారు. మెరక పంట పొలాలకు సాగునీరు లేకపోవడంతో ఇంజిన్ల ద్వారా పంట పొలాలకు సాగునీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మండలంలోని నర్సింగపల్లి, ముఖలింగాపురం, గూడెం, లింగాలవలస, కె.కొత్తూరు, బొప్పాయిపురం, అక్కవరం, పరశురాంపురం, పెద్దశాన పంచాయతీల్లో మెరక పంటలకు సాగునీరు రాకపోవడం, ఎత్తిపోతల పథకాలు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు తమ పంటలను తడుపుకోవడానికి ఇంజిన్ల ద్వారా నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

మండలంలోని 27 పంచాయతీల పరిధిలో 17,830 ఎకరాల్లో వరిసాగు కావాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు 15,480 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. వీటిలో వంశధార ఆయకట్టు ద్వారా 11,250 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. మిగిలిన వ్యవసాయమంతా చెరువుల పైన, వర్షాధారంపైనే ఆధారపడాలి. అయితే కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మెరక పంటలకు సాగునీరు లేక రైతాంగం పలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. ఈ ఖరీఫ్‌లో ఆశించినంతగా వర్షాలు లేకపోవడం, రైతులకు సాగునీరు లభ్యం కాలేదు. ఆగస్టు చివరి నాటికి 516 ఎంఎల్ వర్షపాతం అవసరం కాగా, 439 ఎంఎల్ మాత్రమే వర్షపాతం నమోదైంది. దీంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

రైతుల ఆందోళన

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు తారకరామ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందివ్వాలని కురుడు, రామయ్యపేట, కిష్టపురం, మెండపేట గ్రామాలకు చెందిన రైతుల కోరారు. ఈ మేరకు 200 మంది రైతులు ర్యాలీగా వచ్చి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుడు ఎత్తిపోతల పథకం ద్వారా 200 మంది రైతులకు సంబంధించిన 1650 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. 2007లో తారకరామ ఎత్తిపోతల పథకం ప్రారంభించారని, అప్పటి నుంచి ఈ పథకం ద్వారా ఏటా ఖరీఫ్‌కు సాగునీరు అందించేవారని అన్నారు. అయితే ఈ లిఫ్ట్ నిర్వహణ బాధ్యత కూడా రైతులే చూసుకునేవారని 2019 నుంచి పలాసకు సాగునీరందవ్వాలని మంత్రి సిదిరి అప్పలరాజు ఒత్తిడి చేయడంతో ఇక్కడ ఉన్న విద్యుత్ అధికారులు లిఫ్ట్ ఇరిగేషన్లకు పవర్ కట్ చేశారని అన్నారు. అయితే ఇప్పటికే పెట్టుబడులు పెట్టి నాటిన పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలాసకు సాగునీరు అంది ఇవ్వాలంటే కాలువలు మరమ్మతులు చేపట్టాలి తప్ప... లిఫ్టులకు పవర్ కట్ చేస్తే పలాసకు నీరు వెళ్లదని అన్నారు. ఇప్పటికైనా లిఫ్ట్ ఇరిగేషన్లకు విద్యుత్ పునరుద్ధరణ చేసి సాగునీరు అందివ్వాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎఇ జి.సురేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మెండ గోవింద్, ముత్తురాజు, వీరాస్వామి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

లేగదూడలను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే మేలైన పశు గ్రాసం అవసరమని, ప్రతి రైరూ పాడి పరిశ్రమతో ఆదాయాన్ని పెంచుకోవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం ట్రైమాక్స్ స్కూల్ ఆవరణలో లేగ దూడల ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇది 23వ ప్రదర్శన అని అన్నారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల రైతులకు అనేక మెళుకువలు తెలుస్తాయన్నారు. లేగదూడల ఆరోగ్యంపై తగిన వైద్యం అందించేందుకు వీలుగా ప్రతి సచివాలయంలోనూ వెటర్నరీ సహాయకులు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. పశువులకూ అంబులెన్స్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపిపి గొండు రఘురాం, పశుసంవర్ధకశాఖ జెడి ఎం.కిషోర్, డిడి జగన్మోహనరావు, ఎస్.మన్మథరావు, గార ఎడి రాజవేఖర్, నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణ, సర్పంచ్‌లు కొయ్యాన నాగభూషణ, పీస గోపి, మార్పు పృథ్వీ పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్టు అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులకు ఎదురవుతున్న సమస్యలపై సభ్యుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.కోర్టు కాంటీన్ బకాయి వసూలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. వివిధ కోర్టుల్లో ఖర్చులు లోక్ అదాలత్‌కు ఆర్డర్ చేస్తున్నారని చెప్పారు. అడ్వకేట్లు వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపన, వివిధ కోర్టుల్లో దావాలు, ఇతర మిస్సలేనియస్ పిటిషన్లు సకాలంలో నంబర్లు కాక కక్షిదార్లతో పడుతున్న ఇబ్బందులు చర్చించనున్నట్టు తెలిపారు. న్యాయవాదులకు హెల్త్‌కార్డుల జారీపై చర్చించనున్నట్టు చెప్పారు. న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

నౌపడ : సమగ్ర సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సంతబొమ్మాళి ఎంఆర్‌సి వద్ద ఉద్యోగులు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భాగంగా శాంతియుతంగా నిరసన చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు, సిఆర్‌పిలు, ఇనస్ట్రక్టర్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంఆర్‌సి సిబ్బంది

క్రైమ్ కార్నర్

వరహాలు మృతదేహం

నదిలో పడి వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగం వద్ద వంశధార నదిలో మంగళవారం స్నానానికి దిగి అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం సూర వరహాలు (75) స్నానం చేసేందుకు వంశధార నదికి వెళ్లింది. నదిలోకి దిగుతూ కాలుజారి నదిలోకి కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు నదిలో గాలించినా ఆచూకీ లభించలేదు. కొద్ది గంటల తర్వాత నగిరి కటకం గ్రామ సమీపంలో వంశధార నదిలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

మెట్ల పైనుంచి జారిపడి...

బూర్జ : మండలంలోని లచ్చయ్యపేటకు చెందిన పిన్నింటి పోలమ్మ (57) మెట్లపై నుంచి జారిపడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి ఇంట్లో ద్వారం తగిలి మెట్లపై పడి అక్కడి నుంచి కిందకు జారిపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భర్త వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు : మండలంలోని వసపకు చెందిన కొల్ల లోకేష్ ఒడిశా రాష్ట్రం నుంచి 48 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా... సోమవారం రాత్రి పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం ఎస్ఇబి పోలీసులు చేపట్టిన తనిఖీలో పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితుడిని, మద్యం బాటిళ్లను స్థానిక ఎస్ఇబి ప్రభాకర్‌కు అప్పటించామని తెలిపారు.

టూరిజం క్లబ్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు

ఐటిఐలో టూరిజం క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో పర్యాటకశాఖ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో యువ టూరిజం క్లబ్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ మెంబరు జగన్నాథంనాయుడు, మాట్లాడుతూ జిల్లాలోని వారసత్వ సంపదను, సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల మేనేజర్ అప్పలనాయుడు, ఐటిఐ సహాయ సంచాలకులు వై.రామ్మోహనరావు, లక్ష్మణ్‌నాయుడు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న జగన్నాథరెడ్డి

ఆక్రమణలను తొలగించాలని వినతి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ 15వ వార్డు పరిధిలోని ప్రజా ప్రస్థానం విజయ నాటిక వద్ద కాలువల దురాక్రమణతో మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతుందని వైసిపి నాయకులు గుజ్జు జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆక్రమణలు తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాము నివసిస్తున్న ప్రాంతంలో రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో కొన్ని చోట్ల దురాక్రమణకు గురయ్యాయని తెలిపారు. కాలువల్లో మట్టి, రాళ్లతో పూడ్చి వేయడంతో మురుగు నీరు పారుదలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. కాలువలపై ఉన్న ఆక్రమణలను, అవరోధాలను తొలగించి, కాలువల్లో పూడిక తీసి మురుగు నీటిని తొలగించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ప్రతినిధి పిలకా సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఆమదాలవలస శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చుట దృష్ట్యా 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి టౌన్ -1 ఫీడర్ పరిధిలోని చింతాడ తదితర ప్రాంతాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన గోవిందరాజులు

వినతిపత్రం అందజేస్తున్న గోవిందరాజులు

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ కోమటి సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు మంగళవారం విజయవాడ టిడిపి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కళింగ కోమటిలను ఒబిసిలో చేర్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో టిడిపి పరిస్థితి, తదితర విషయాలు చర్చించామని గోవిందరాజులు తెలిపారు.

ఆర్థికసాయం అందిస్తున్న రాజు

చిన్నారికి అండ

కవిటి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఆద్యకు అండగా ఉంటామని ఇచ్ఛాపురం జనసేన నాయకుడు దాసరి రాజు, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు అన్నారు. ప్రగడపుట్టుగలోని చిన్నారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన రూ.20 వేలు, కపాసుకుద్దికు చెందిన రామలింగేశ్వర యువజన సంఘం తరఫున రూ.10,500 మంగళవారం అందజేశారు. కపాసుకుద్దికు చెందిన సాయిరాం, నెలవంకకు చెందిన మధు తమ స్నేహితుల ద్వారా సేకరించిన రూ.25 వేలు పాప తండ్రికి అందించారు. రూ.20 వేలు ఫోన్ పే చేశారు. కొఠారికి చెందిన హెల్పింగ్ హేండ్స్ రూ.20 వేలు, పెద్దలక్ష్మీపురం యువత రూ.12 వేలు, కవిటి కళ్యాణి జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.10,300, ఎస్‌విజె డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు రూ.7 వేలు, సోంపేటకు చెందిన బేకరీ యూనియన్ రూ.5 వేలు, తెలంగాణ కేడర్‌లో డిఎస్‌పిలుగా పనిచేస్తున్న పండి జయరాం, ఎస్.రాంబాబు రూ.5 వేలు, శ్రీకాకుళం ఆర్ఐ అజయ్, వారి స్నేహితులు కలిసి రూ.పది వేలు, ఈనాడు సబ్ ఎడిటర్ పి.ధనుంజయ్ రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బైపల్లి ఈశ్వరరావు, నాగుల హరి బెహరా, అంగ సురేష్, దుగాన దివాకర్, తలగాన ఈశ్వర్, లోళ్ల ధనుంజయం, బడగల రామకృష్ణ, కపాసుకుద్ది రామలింగేశ్వర పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న శ్రీరామలింగేశ్వర యూత్

'ఫ్యామిలీ డాక్టర్' శిబిరం పరిశీలన

పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీతులసి

పోలాకి : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సమాచారాన్ని సంబంధించి ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఆయా ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా సమాచారం తెలియజేయాలని జిల్లా నోడల్ అధికారి, టెక్కలి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీతులసి సూచించారు. మండలంలోని చిన్నఈదులవలస హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 104 రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, 104 సిబ్బంది సమన్వయం చేసుకోవాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పోలాకి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుమను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాలకు వచ్చిన రోగులతో మాట్లాడి, ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి వివరించారు. వైద్య సేవల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరాధన పాల్గొన్నారు.

కాశీరాజును కలిసిన ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సాగి కాశీవిశ్వనాధరాజుకు విశాఖపట్నం ఆయన స్వగృహంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఇఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి బలోపేతానికి దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వంలో నూతన కార్యవర్గం కృషి చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, నియోజకవర్గం నాయకులు లంక అప్పలనాయుడు, సంపతరావు నాగేశ్వరావు, వజ్జపర్తి రఘురామ్, పి.వి.రత్నం, దుక్క ఆదినారాయణ, ఆకెళ్ల సూరిబాబు, దన్నాన రాజేంద్ర పాల్గొన్నారు.

కాశీరాజుకిశు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరరావు

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ఉన్నతస్థాయి వైద్య సేవలే లక్ష్యం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రోగులందరికీ ఉన్నతస్థాయి వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ... వైద్య ఆరోగ్యశాఖలో పెను మార్పులు తీసుకొచ్చామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని అనంతగిరిలో సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు ఆధ్వర్యాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. రూ.1.78 కోట్లతో అన్ని వసతులు కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. నిరంతరం వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని పేద ప్రజలకు ఏడాదికి రూ.ఐదు లక్షల వరకు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి వేలాది వైద్యులు సిబ్బంది ఉద్యోగులు భర్తీ చేశామని అన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. వెంకటాపురం-నువ్వులరేవు రహదారి అభివృద్ధికి రూ.16 కోట్ల కేటాయించి పనులు చేపడుతున్నామని తెలిపారు. రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించామని, దీని ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అనంతగిరి పంచాయతీలో ఇప్పటి వరకు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా టిడిపి నుంచి 150 మంది వైసిపిలోకి మంత్రి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని బి.మీనాక్షి, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, ప్రతినిధి ఉదయ్‌కుమార్, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు హనుమంతు వెంకటరావు, పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పి.వి.సతీష్ ,పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ, ఎంపిటిసి ఉరిటి పద్మావతి కామేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం సందర్శన

ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జోగారావు

ప్రజాశక్తి- సోంపేట

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి ప్రతినిధి, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డు నమోదు చేసుకొని పదేళ్ల పూర్తయిన వారంతా తప్పక అప్డేట్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు జవహర్, మౌనిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం గ్రామంలోని చెరువుగట్టు పై ఉపాధి హామీ పథకంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, తద్వారా పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎ చిరంజీవులు, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్వరి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

తాగునీటి బోరును వేయిస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

సేవా సూరుడు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి స్వయంకృషితో వ్యాపార రంగంలో ఎదగడడం చిన్న విషయం కాదు. ఎచ్చెర్ల నియోజకవర్గం కుశాలపురంలో గన్నయ్య, వైకుంఠమ్మ అది బహు సంతానం. చిన్నతనం నుంచి సూర శ్రీనివాసరావు అనేక ఆర్థిక ఇబ్బందుల మధ్యే పెరిగారు. చదువుపై ఆసక్తి తక్కువే. దాంతో చదువుకు స్వస్తి చెప్పి చిరు వ్యాపారిగా జీవితం ప్రారంభించారు. క్రమశిక్షణ, పట్టుదలతో అహోరాత్రులు పనిచేసి నిలదొక్కుకున్నారు. వ్యాపారవేత్తగా స్థిర పడటమే కాదు.. ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఉన్నత స్థానానికి చేరుకున్నారు. శ్రీనివాసరావును వ్యాపారవేత్తగానే కాకుండా సమాజోద్ధారకుడిగా ప్రజల్లో అంతెత్తున నిలబెట్టాయి. ప్రజల గుండెల్లో స్థానం కల్పించాయి. సంపాదనలో కొంత సేవకు కేటాయిస్తూ నిరంతరం సేవాలో నిమగ్నమైనందునే సేవా సంపన్నుడయ్యారు.

ట్రస్టు ద్వారా విస్తృత కార్యక్రమాలు

ఏ పని చేసినా వ్యవస్థాగతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని భావించే శ్రీనివాసరావు తన సేవా సంకల్పాన్ని ఆచరణలో పెట్టేందుకు తన పేరుతోనే ఒక సేవా సంస్థను దాదాపు మూడేళ్ల క్రితం స్థాపించారు. తన పుట్టినరోజు నాడే ఎస్-ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2020లో కరోనా వికృత క్రీడలో నలిగి రాలిపోతున్న పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. నేనున్నాంటూ బహుముఖంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా బారిన పడిన బాధిత కుటుంబాలను ఆదుకోవడంతోపాటు లాక్‌డౌన్ వల్ల పనులు లేక ఆకలితో అల్లాడుతున్న వారికి, జిల్లాకు తిరిగి వస్తున్న వలస కూలీలకు రెండు పూటలా భోజనం పెడుతూ, నిత్యావసర సరుకులు అందజేస్తూ ఆపద్బాంధ వుడయ్యారు. ప్రయివేటు పాఠశాలల సిబ్బందికి, సినిమా హాల్ కార్మికులకు, విశ్వ బ్రాహ్మణులకు, జర్నలిస్టులకు, పేద కళాకారులకు వేలాదిగా నిత్యవసర కిట్లను పంపిణీ చేశారు.

సేవా కార్యక్రమాలు

- ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా కరోనా సమయంలో నెలల తరబడి లక్షలాది మంది కరోనా రోగులు, వారి సహాయకులకు భోజన సౌకర్యం కల్పించారు.
- 2021లో తోటపాలెంలో రచ్చబండతో పాటు తాగునీటి పథకాన్ని నిర్మించారు.
- అత్యవసర వేళ ప్రజలను సకాలంలో ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.
- ఎచ్చెర్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సరస్వతిదేవి, వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణ, గాంధీజి విగ్రహాలు ఏర్పాటు చేయించారు.
- శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలు సబ్ జైలులో గాంధీ విగ్రహం ఏర్పాటుతో పాటు ఖైదీల అవసరార్థం పిండిమిల్లు కూడా అందించారు.
- మృతి చెందిన పలువురు జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు.
- ఏటా ఉగాది, సంక్రాంతి పండుగల సందర్భంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నారు.
- చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పుస్తకాలు అందిస్తున్నారు.
- నగరంతో పాటు పరిసర గ్రామాల్లోని కేన్సర్ బాధితులకు ఆర్థికసాయం, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు.
- పలు క్రీడా టోర్నమెంట్ల నిర్వహణకు సహాయ సహకారాలు అందించారు.
- జిల్లా వ్యాప్తంగా అనేక ఆలయాల నిర్మాణాలకు విరాళాలు అందజేశారు.

నిత్యావసర వస్తువులను అందజేస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొండపేట గ్రామ సమీపంలో గోతులమయంగా తయారైన రహదారిపై గోతులను మంగళవారం పోలీస్ యంత్రాంగం చొరవతో పూడ్చివేశారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది తీవ్ర గాయాలకు గురి కావడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటుచేసుకోవడంతో ఎట్టకేలకు పోలీసు యంత్రాంగం స్పందించింది. మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామం వద్ద పాలకొండ శ్రీకాకుళం ప్రధాన రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. ఇదే ప్రాంతంలో ఈ నెలలో సుమారు 15 వరకు వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. అంతేకాకుండా సోమవారం జంగాలపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు నిమ్మక వసంత్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో రహదారి పూర్తిగా గోతుల మయంగా మారిందని సంబంధిత అధికారులకు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో స్థానిక పోలీసు యంత్రాంగం ఎస్సై అశోక్ బాబు ఆధ్వర్యంలో గోతులను పూడ్చివేశారు. అయితే ప్రభుత్వ అధికారులు ముందుగానే స్పందించి ఉంటే ప్రాణాలు కోల్పోయే సంఘటనలు ఎదురు కావని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చొరవ అభినందించదగ్గ విషయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

పలాస : సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల కొండివీధిలో సిసి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బడాన పుష్ప, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, ఉప సర్పంచ్ పొందర ఈశ్వరరావు, వార్డు మెంబరు బడే లక్ష్మి, కోరాడ నాగరాజు, బాడన నాగరాజ్, రమేష్, ఉమా పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో పలు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని ఎంపిపి బోర పుష్ప అన్నారు. మండలంలోని పాయథారి పంచాయతీలో సైదలపుట్టుకలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి ప్రతినిధి ప్రియ, కె.మోహనరావు, రంగాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఇంటింటా సర్వే శత శాతం పూర్తి

రణస్థలం : ఓటర్ల నమోదులో భాగంగా కొనసాగిన ఇంటింటా సర్వేను శత శాతం పూర్తయిందని ఓటరు నమోదు అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. రణస్థలం తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభమైన ఇంటింటా సర్వే ఈ నెల 21తో ముగిసిందని అన్నారు. ఇప్పటివరకు యాప్‌లో 92 శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఇంకా ఎమైనా సమస్యలు ఉంటే యాప్‌లో సాంకేతికపరమైన లోపాలను సరిదిద్దుకుని పూర్తి చేయాలన్నారు. రోజూ వేకువజామున, సాయంత్రం వేళల్లో యాప్ బాగా పనిచేస్తుందని, ఆ సమయాల్లో బిఎల్‌ఒలు పనిచేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంపై రాజకీయ పార్టీల నాయకులకు ఎమైనా అభియోగాలు ఉంటే తెలపాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు లైఫ్ జాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సముద్రంలో చేపల వేటకు వెళ్లి తరచూ ప్రమాదాలకు గురవుతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన లైఫ్ జాకెట్లను అందించడం మంచి పరిణామమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయం, అనురాగ నిలయంలో ఎం.వి.ఆర్.మూర్తి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ సౌజన్యంతో 200 లైఫ్ జాకెట్లను మత్స్యకారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ లైఫ్ జాకెట్ల వల్ల మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రభుత్వం తరపున కూడా లైఫ్ జాకెట్లను పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో చర్చించనున్నట్టు చెప్పారు. వారి జీవన విధానంలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం చిత్తశుద్ధి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసులు, మగటపల్లి వెంకటరమణమూర్తి, ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు, సెక్రెటరీ పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ సంస్థ సెక్రెటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కె.దుర్గాశ్రీనివాస్, పి.వైకుంఠరావు, ఎన్.అప్పన్న, మత్స్యకార సంఘం అధ్యక్షులు కోనాడ నరసింహరావు పాల్గొన్నారు.

9న లోక్‌అదాలత్

టెక్కలి : టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు నుంచి లోక్ అదాలత్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజీయే రాజీ మార్గంగా భావించి కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మహిళాశక్తి'తో మహిళాభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి ప్రకటించిన మహిళాశక్తితోనే మహిళలు అభివృద్ధి చెందుతారని జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కనుగులవలస పంచాయతీ పరిధిలోని సీపానచంద్రయ్యపేట టిడిపి మండల అధ్యక్షుడు సర్పంచ్ నూకరాజు ఆధ్వర్యాన మంగళవారం మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని ఆటకెక్కించారని మండిపడ్డారు. టిడిపి హయాంలో రూ.200 ఉన్న వృద్ధుల పింఛను రూ.2 వేలుకు పెంచామని అన్నారు. మహిళాశక్తి కార్యక్రమంలో ప్రకటించిన తల్లికి వందనం పథకంలో భాగంగా 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు ఇంటిలో ఎంతమంది ఉంటే వారందరికీ నెలకు రూ.1500 చొప్పున బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తారని అన్నారు. ప్రతి ఇంటికీ మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలండర్లను అందజేస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించానున్నారని తెలిపారు. కార్యక్రములో జిల్లా మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, అన్నెపు భాస్కరరావు, హారిక, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, లక్ష్మీనారాయణ, ఎండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

గార : మండలంలోని కె.మత్స్యలేశంలో టిడిపి మహాశక్తి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నిర్వహించారు. టిడిపి ఇచ్చిన హామీలతో కూడిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోపింటి రాధాకృష్ణారెడ్డి, పొట్నూరు కృష్ణమూర్తి, జల్లు రాజీవ్, వెలమల శ్రీనివాస్, వేణుమాస్టారు, వారధి బాపనయ్య, గోర సురేష్, కైబడి రాజు పాల్గొన్నారు.

'ఎంజిఆర్' పరామర్శ

హిరమండలం : మండలంలోని సుభలయ్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన గురజాపు నీలమ్మకు ఇటీవల ఆటో ప్రమాదంలో గాయాలు పడింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం పరామర్శించారు. అలాగే రెల్లివీధికి చెందిన జోగి రాములు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పాతహిరమండలం హరిజన వీధికి చెందిన పొట్నూరు దాలమ్మకు ఇటీవల కాలు విరిగింది. పాత హిరమండలానికి చెందిన గోవుదల తిరుపతిరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరందరినీ పరామరించారు. చిన్న కోరాడ వీధికి చెందిన నగరపు శంకరరావు, బజారు వీధికి చెందిన ఇసై అప్పన్న ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యఓఉలు యాళ్ల నాగేశ్వరరావు ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, గొట్ట మాజీ సర్పంచ్ చాపల రామారావు, చవితిసీది మాజీ సర్పంచ్ మిర్యాబిల్లి భగవాన్‌దాస్, మామిడి రవికుమార్, కలిశెట్టి వేణుగోపాలరావు, పైల శాంతారావు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రెడ్డి ధనుంజయ, రవి, రమేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : కేక్‌ను తినిపిస్తున్న గోవిందరావు

దాస్‌నాయుడుకు శుభాకాంక్షలు

కొత్తూరు: స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎద్దు దాస్‌నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుడ్డ చంద్రధరరావు పాల్గొన్నారు.

ఘనంగా 'చిరు' జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం : రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

ఇచ్ఛాపురం : సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు సందర్భంగా చిరంజీవి అభిమానులు మంగళవారం పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా డాక్టర్ దేవేంద్రరెడ్డి, డాక్టర్ శేషారెడ్డి మాట్లాడారు. మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే, ఆ వృక్షాలే మానవాళిని రక్షిస్తాయని అన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలీమ్ ఖాన్, దాసరి అజయ్, దట్టి శ్రీను, మన్యల విఘ్నేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని నగరంలోని అరసవల్లిలో అభిమానులు యాత్రికులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఎస్‌విసి థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో తైక్వాండో శ్రీను, వైశ్యరాజు మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెస్సర్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.జనార్ధనరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సహచర విద్యార్థులంతా కలిసి నృత్యాలు చేసి అబ్బురపరిచారు. ముందుగా సమావేశం నిర్వహించి విద్యార్థి దశలో చదువుపై శ్రద్ధ చూపాలని, దీనిలో భాగంగానే ఆటలు, నృత్యాలు అవసరమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, కళాశాల లెక్చరర్లు ఎ.పోలయ్య, ఎం.నారాయణ, రాజేష్, పి.వైకుంఠరావు, చిరంజీవి పాల్గొన్నారు.

పలాస : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కంచిలి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శరత్‌బాబు అన్నారు. స్థానిక విద్యా వాహిని కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుపతిరావు అధ్యక్షతన మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనాల గోపాల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరిబాబు, జూనియర్ కళాశాల పి.మన్మథరావు, డైరెక్టర్ సంధ్యారాణి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

మాట్లాడుతున్న డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి

'క్యాంపస్ కాప్స్'లకు శిక్షణ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని డిగ్రీ కళాశాలలో క్యాంపస్ కాప్స్ ఎంపిక చేసిన 70 మంది విద్యార్థులకు స్థానిక విద్యావాహిని డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి తెలిపారు. కాశీబుగ్గ విద్యావాహిని కళాశాలలో శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి విద్యార్థీ కళాశాల ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కాపాడే పోలీసులా వ్యవహరించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు నేరాలు అరికట్టడం, సైబర్ నేరాలు అలోచన ధోరణులు, సమాజంపై అవగాహన, మత్తు పదార్థాలకు దూరంగా ఉండే విధంగా, అలాగే రహదారి భద్రత మొదలైన విషయాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కవిటి, బొర్రపుట్టుగ గ్రామాల్లో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్ సంతోష్ బెహరాపై ఎంపిటిసి దుద్ది హేమలతతో కలిసి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఎస్‌డిటి సంతోష్ కుమార్‌ను మంగళవారం వినతిపత్రం అందజేశారు. రేషన్ పంపిణీ సక్రమంగా లేదని, 20 కేజీల బియ్యం వద్ద మూడు నుంచి నాలుగు కేజీలు తక్కువగా వస్తున్నాయని వివరించారు. ఎండియు వాహనానికి సంబందించిన తూకం యంత్రం వాడకుండా రేషన్ డీలర్ కాటా వాడుతున్నారని, ఎండియు వాహనం తూకం యంత్రం ఏదని అడిగితే పాడైందని చెబుతున్నాడని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రేషన్ తక్కువగా వస్తోందని, గత మూడు నెలలుగా ఇదే జరుగుతోందని, కాటా మార్చమని చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సిఎస్‌డిటి బియ్యం తూకంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తేడా ఉండకూడదని, వచ్చే నెల నుంచి కచ్చితంగా అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో దుద్ది ధర్మారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌డిటి సంతోష్‌కుమార్

'కొత్తమ్మతల్లి' దర్శన టిక్కెట్ల ధర పెంపు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి దేవస్థానంలో విక్రయిస్తున్న పలు రకాల టిక్కెట్లు ధరను పెంచుతూ విజయవాడ దేవాదాయ ధర్మదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు కొత్తమ్మతల్లిని దర్శించుకోవడానికి మొక్కుబడి రుసుంటిక్కెటు ధర ఒకరికి రూ.పది ఉంటే, ఇప్పుడు రూ. 20, రూ.20 ఉన్న ప్రత్యేక దర్శనం టిక్కెట్ ధర ఇక నుంచి రూ.50, ఉయ్యాలసేవ దర్శిన టిక్కెట్ ధర రూ.50 లు ఉంటే... దానిని రూ.100లు, అంతరాలయ దర్శనం ఇప్పటి వరకు రూ.50లు ఉంటే... దానిని కూడా రూ.100 పెంచామని పేర్కొన్నారు. ఇక నుంచి ఈ ధరలతో టిక్కెట్లను దేవస్థానంలో అమ్ముతుందని, యాత్రికులు గమనించాలని కోరారు.

పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి

భూ హక్కు పత్రాలు అందజేత

కోటబొమ్మాళి: జగనన్న భూహక్కు పథకం ద్వారా రైతులకు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ అనందపురంలో టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఎల్.వి.రమణతో కలిసి శాశ్వత భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎన్నోఏళ్లుగా ఉన్న భూ సమస్యలు జగనన్న భూహక్కు పథకం ద్వారా పరిష్కారమైందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, విస్తరణ అధికారి రాజారావు, వార్డు మెంబర్ నేతింటి సింహాచలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బూర్జ : మండలంలోని కొల్లివలస ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన సుభాషిని నాయక్‌ను గాంధీ యువజన సేవా సంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొల్లు సురేష్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులుగా సుభాషిని ఎంతగానో సేవలను అందజేశారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జీడి వేణుబాబు, సంఘ సభ్యులు సైరిగాపు సంతోష్, వెంకటరమణ, శ్రీనివాసరావు, చీర హరిబాబు, హరిబాబు, ఉపాధ్యాయులు అలివేణి, రమామణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

ప్రతి వార్డునూ అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రతి వార్డునూ అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ మేధా స్కూల్ సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.90 వేలు వ్యయంతో నిర్మించనున్న కల్వర్టు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని అన్నారు. సమస్యలు ప్రాతిపదికన గుర్తించి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీ శంకర్, మున్సిపల్ ఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, మున్సిపల్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

బూర్జ : మండలంలోని చిన్నలంకాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రామారావుతో పాటు గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలకు ధాన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.ప్రభావతి, విద్యాకమిటీ చైర్మన్ ప్రభావతి పాల్గొన్నారు

వైసిపికి రాజకీయ సిద్ధాంతం లేదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా ప్రయోజనాలకు ప్రతి రాజకీయ పార్టీకీ ఒక సిద్ధాంతం ఉంటుందని, కానీ, వైసిపికి సిద్ధాంతం పనిలేదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. నగరంలోని అరసవల్లిలోని ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేవలం ప్రశాంత్ కిషోర్ చెప్పిన రాజకీయ వ్యూహాలతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల దృష్టిని మల్చడానికి ఇప్పుడు మంత్రి ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్, ఇందిరాగాంధీ పేర్లు జపిస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌పై తనకున్న భావన చట్టసభలో మంత్రి ధర్మాన వెల్లడించారని గుర్తుచేశారు. ఇప్పుడు పదవుల కోసమో, రాజకీయ ఉనికి కోసమో ఆయన జపం చేస్తున్నారన్నారు. ఆయన మాటలను ప్రజలు విశ్వసించబోరని తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒలు

రుచికరమైన భోజనం పెట్టాలి

కోటబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మోను ప్రకారం రుచికరంగా వండిపెట్టాలని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. మండలంలోని ఊడికలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం సందర్శించారు. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తరగతి వారీగా ప్రతి ఉపాధ్యాయుడూ భోధనాభ్యసనా ప్రక్రియలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పిల్లలతో కలిసి పంక్తి భోజనం చేశారు. పిల్లల వర్కు బుక్స్, నోట్ పుస్తకాలు, డైరీలను విశితంగా పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్,ఎన్.మోహనరావు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేత

టెక్కలి : విశ్రాంత ఉపాధ్యాయుడు, మేధావుల ఫోరం సంఘం అధ్యక్షులు జి.వి.రెడ్డి మాస్టార్ తన ఔధార్యాన్ని చాటుకున్నారు. రెడ్డి మాస్టార్ సతీమణీ కమలకుమారి, కుమార్తె దల్లి నిర్మళ గుర్తుగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగుల సౌకర్యార్థం రెండు వీల్ చైర్ల మంగళవారం విరాళంగా సూపరింటెండెంట్ మహరాజ్‌కు అందించారు. రెడ్డి మాస్టారుకు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి కె.దనుంజయరావు, సంఘ సభ్యులు దల్లి వీరాస్వామిరెడ్డి, బొడ్డ అయ్యబాబు, అనిశెట్టి చిట్టెన్న, దూసి ఆంధ్రా స్టాలిన్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, ప్రధాన హరిశ్చంద్రరావు అభినందించారు.

పనులను పరిశీలిస్తున్న ప్రసాద్

ఇంటింటికీ తాగునీరు

జలుమూరు: జగనన్న కాలనీలోని ఇంటింటికీ తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.ఎస్.ప్రసాద్ అన్నారు. మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపడుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. బుధవారం నాటికి ట్రయల్ రన్ వేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాన్ బెనహర్, డిఇ జల్లు సుదర్శన్, పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్యకుమార్ పాల్గొన్నారు.

రేపు బాణాంలో 'మహాశక్తి'

పొందూరు : మండలంలోని బాణాంలో ఈ నెల 24న టిడిపి మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

రామ్మోహన్

మంత్రి ధర్మాన పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ అరసవల్లి పాలక మండలి సభ్యులు ఎన్.కోటేశ్వర చౌదరి కుటుంబాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం పరామర్శించారు. ఇటీవల కోటేశ్వర చౌదరి కుమారుడు ఎన్.పవన్‌శ్రీనివాస్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి పవన్‌శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రత్నాల నరసింహమూర్తి, డాక్టర్ ఎస్.గిరిబాబు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు